విజయనగర సామ్రాజ్యం- పరిపాలన, సమాజం, సంస్కృతి

ప్ర:విజయనగర సామ్రాజ్యంలోని పరిపాలన వ్యవస్థను వివరించండి?

జ: రాజ్య వ్యవస్థ: విజయనగర ప్రభువులు సంప్రదాయిక రాచరిక వ్యవస్థను అనుసరించారు. అయితే నిరంతరం యుద్ధాలు, దాడులు చేయాల్సి రావడంతో సైనిక అవసరాలకు అనుగుణమైన ప్రభుత్వ వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నారు.

కేంద్ర ప్రభుత్వం:

రాజు.. సర్వాధికారి, సర్వ సైన్యాధ్యక్షుడు. అయినప్పటికీ రాజు అధికారం ధర్మశాస్త్రాలకు, సంప్రదాయాలకు లోబడి కొనసాగింది. రాజుకు సహాయికంగా మంత్రి మండలి పనిచేసింది. కానీ మంత్రి మండలి సలహాలను రాజు తప్పనిసరిగా పాటించాలనే నియమం లేదు. సర్వ శిరః ప్రధాని ముఖ్యుడు.

కేంద్ర ప్రభుత్వంలో అట్టవన (రెవెన్యూ), కందాచార (సైనిక శాఖ), భాండార (కోశాగారం), సుంక వ్యవహార (పన్నుల శాఖ) అనే ముఖ్య శాఖలున్నాయి.

ప్రాంతీయ పాలన:

విజయనగర సామ్రాజ్యం కొన్ని రాష్ట్రాలు లేదా రాజ్యాలుగా విభజితమైంది. రాజ్యంపై దుర్గాధిపతి నాయకుడు. అతను సైన్యాన్ని కూడా పోషించేవాడు కాబట్టి దుర్గ దండ నాయకుడిగా పిలిచేవారు.

పరిపాలనలో ప్రాథమిక విభాగం గ్రామం. కొన్ని గ్రామాల కూటమిని 'స్థల' అని, కొన్ని స్థలాల కూటమిని 'సీమ' అని, కొన్ని సీమల సమూహాన్ని 'రాజ్యం' అని అన్నారు. గౌడ, కరణం అధికారులు. వారి కార్యాలయాన్ని చావడి అని పిలిచేవారు. గ్రామంలో 12 మంది ఆయగార్లు కీలక పాత్ర పోషించారు. వారిలో కరణం, రెడ్డి, తలారి ముఖ్యులు.

పన్నుల వ్యవస్థ:

ఆ కాలంలో పన్నుల భారం అధికమే. అన్ని వృత్తులపైనా పన్నులు విధించే ప్రయత్నం చేశారు. పండిన పంటలో మూడో వంతును, కొన్ని సందర్భాల్లో సగం మొత్తాన్ని శిస్తుగా వసూలు చేశారు. ఇంకా మంగళి, కుమ్మరి, సాలె లేదా నేత వంటి వృత్తులపైనా పన్నులు విధించారు. యాచకులపై, వేశ్యలపైనా పన్నులు విధించారు. వివాహ సమయంలో (గుడి కళ్యాణం, కళ్యాణ కానిక) ఇరు పక్షాల వారు కూడా పన్నులు చెల్లించాల్సి వచ్చేంది.

న్యాయ వ్యవస్థ:

రాజాస్థానమే సర్వోన్నత న్యాయస్థానం. మాధవాచార్యుడు రాసిన 'పరాశర మధవీయం' ఆధారంగా న్యాయ వ్యవస్థ పనిచేసింది. ప్రధాని కూడా న్యాయ విధులు నిర్వర్తించినట్లు తిమ్మరసుకు ఉన్న ధర్మ ప్రతిపాలక అనే బిరుదును బట్టి గ్రహించవచ్చు. ఇంకా స్థలాలు, గ్రామాల్లో కూడా ధర్మాసనాలు ఏర్పరిచారు. రాజాస్థానాల్లో ప్రాడ్వివాక్కులు న్యాయ విధులు నిర్వహించారు. సరైన సాక్ష్యం లభించనప్పుడు దివ్య పరీక్షలు అమల్లో ఉన్నాయని నికోలో కాంటి తెలిపాడు. ఇక.. శిక్షలు కూడా కఠినంగా ఉండేవి. బ్రాహ్మణులకు మరణ శిక్ష నుంచి మినహాయింపు ఉంది.

సైనిక వ్యవస్థ:

విజయనగర సామ్రాజ్యంలో రెండు రకాల సైన్యం ఉండేది. అవి..

- **కై జీతపు సైన్యం:** వీరిని రాజు ప్రత్యక్షంగా నియమించి, తన ఆధీనంలోనే ఉంచుకునేవాడు.
- **అమర నాయక సైన్యం:** అమర నాయకులకు అమరాలుగా పిలిచే భూములు ఇచ్చేవారు. ఆ భూములను అనుభవిస్తూ సైన్యాన్ని పోషించి అవసరమైనప్పుడు రాజుకు సైనిక సహాయం చేసేవారు.

సరిహద్దు ప్రాంతాల్లో శాంతి భద్రతలను కాపాడేందుకు 'పాలెగాళ్ల'ను నియమించారు.

యుద్ధ తంత్రంలో స్థల, జల, గిరి, వన దుర్గాలకు ప్రాధాన్యముంది. అరేబియా, పర్షియా నుంచి మేలు జాతి గుర్రాలను దిగుమతి చేసుకున్నారు. విజయనగర ప్రభువులు నౌకాదళాన్ని కూడా నిర్మించారు.

ప్ర:విదేశ యాత్రికుల వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ విజయనగర కాలం నాటి సాంఘిక, ఆర్థిక పరిస్థితులను చర్చించండి?

జ: సాంఘిక పరిస్థితులు: శాసనాల్లో, సాహిత్యంలో అష్టాదశ కులాలను ప్రస్తావించినప్పటికీ కులాలు, ఉపక కులాల సంఖ్య అంతకంటే ఎక్కువగా ఉండేది. వర్ణ వైషమ్యాలు కూడా ఎక్కువే. బ్రాహ్మణులు కేవలం పౌరోహిత్యమే కాకుండా ఇతర వృత్తులు కూడా చేపట్టారు. వారిలో ఆరు రకాల వారు ఉన్నారని బార్బోసా, డొమింగోపేస్ తెలిపారు. బ్రాహ్మణులు వ్యవసాయంతోపాటు కొన్ని నీచ వృత్తులు చేపట్టారని కూడా తెలుస్తోంది.

ఆ సమాజంలో క్షత్రియులు నామమాత్రమే. వైశ్యులు దేశీయ వాణిజ్యంపై పట్టు కొనసాగించారు. వైశ్యులు రకరకాల మోసాలకు పాల్పడి ప్రజల నిరాదరణకు గురయ్యా రు. శూద్ర కులాల్లో విజయనగర యుగంలో రెడ్డి తదితర కులాల ప్రాధాన్యం తగ్గింది. కమ్మ వర్ణంలోని పెమ్మసాని వంటి కుటుంబాలు ప్రాధాన్యం పొందాయి. అస్పృశ్యుల్లో ఆంధ్ర ప్రాంతంలో మాల, మాదిగ కులాలు కనిపిస్తాయి. శూద్రులు బ్రాహ్మణాధిక్యాన్ని ప్రశ్నించి కొన్ని సందర్భాల్లో యజ్ఞోపవీతాలను ధరించే ప్రయత్నం చేశారు.

విజయనగర ప్రభువులు అన్ని మతాలను సమానంగా ఆదరించినప్పటికీ మత వైషమ్యాలు తలెత్తాయి. విజయనగర సామ్రాజ్యంలో

క్రైస్తవులు, యూదులు, హిందు, ముస్లిం అనే భేదాలు లేవని బార్బోసా వ్యాఖ్యానించాడు. అయితే ప్రభువులు వైష్ణవాన్ని ఎక్కువగా ఆదరించడంతో వైష్ణవ గురువులు కొందరు ఇతర మతాలను అణచివేసే ప్రయత్నం చేశారు. మతంలో మూఢ విశ్వాసాలు కూడా ఎక్కువగా ఉండేవి. విజయనగరంలో నవరాత్రుల సందర్భంగా భారీ సంఖ్యలో మేకలు, దున్నలను బలిచ్చారని డొమింగోపేస్ తెలిపాడు.

నాటి సమాజం నైతికంగా పతనమైంది. భోగ లాలసత, వేశ్యలోలత్వం పెరిగాయి. బహుభార్యత్వం ప్రబలింది. సమాజంలో బాల్య వివాహాలు, కన్యాశుల్కం, వరకట్నం వంటి దురాచారాలు ఉన్నాయి. ఉన్నత వర్గాల్లో సతీసహగమన ఆచారం పాటించినట్లు నికోలోకాంటి వ్యాఖ్యానించాడు. హిందువులు భర్త శవంతోపాటు భార్యని కూడా ఖననం చేశారని న్యూనిజ్ చెప్పాడు.

ఆర్థిక పరిస్థితులు:

విజయనగర సామ్రాజ్యం సిరి సంపదలతో తులతూగినట్లు విదేశీయుల కథనాన్ని బట్టి తెలుస్తోంది. నికోలో కాంటి, అబ్దుల్ రజాక్, బార్బోసా వంటి యాత్రికులు విజయనగర వైభవాన్ని ప్రస్తుతించారు. విజయనగరం 60 మైళ్ల చుట్టుకొలతతో ఏడు ప్రాకారాలను కలిగుందని నికోలో కాంటి వర్ణించగా; కనీవినీ ఎరుగని వైభవం విజయనగరానిదేనని, వీధుల్లో వజ్ర, వైఢూర్యాలు, రత్నాలు రాశులుగా పోసి అమ్ముతున్నారని అబ్దుల్ రజాక్ ఆశ్చర్యం వెలిబుచ్చాడు.

విజయనగర సామ్రాజ్యానికి వ్యవసాయాభివృద్ధి కీలకం. సామ్రాజ్యంలో సారవంతమైన భూములున్నాయని న్యూనిజ్, పేస్‌లు తెలిపారు. జనాభాలో ఎక్కువ మంది వ్యవసాయదారులే. వ్యవసాయాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రభువులు, ఉద్యోగులు ఎన్నో తటాకాలు నిర్మించారు. **ఉదా:** అనంత సాగరం; నరసాంబుధి, నాగులాపుర తటాకం తదితరాలు.

వరి, జొన్న, సజ్జ, రాగి, నువ్వులు, ఆవాలు, ఆముదాలు, చెరకు, పత్తి వంటి పంటలను పండించారు. వరిలో తీగ మల్లెలు, ఖర్జూరం, సంపెంగలు, రాజనాలు, కుసుమలు వంటి రకాలున్నాయి. 'దేశమంతా అరటి, జామ, నిమ్మ, మామిడి, ఆకు తోటలున్నాయని పండ్లు చౌకగా లభిస్తున్నాయ'ని డొమింగోపేస్ వ్యాఖ్యానించాడు.

పలు రకాల వృత్తుల ద్వారా వస్తూత్పత్తి జరిగింది. సాలి, పద్మ సాలి, మాల, జాంద్ర కులస్థులు నేతవృత్తిని అవలంభించారు. ఆదోని, తాడిపత్రి, పెనుకొండ వంటివి నూలు పరిశ్రమలకు కేంద్రాలుగా విలసిల్లాయి. అనంతపురం, గుత్తి, వజ్రకరూరు వజ్రాల పరిశ్రమకు కేంద్రాలుగా ఉన్నాయి. పన్నీరు, బుక్కాపిండి వంటి అత్తరులను గంధకారులు ఉత్పత్తి చేశారు. పందాణం వారు కర్ర, రాగి, ఇనుము వంటి పదార్థాలతో రకరకాల పనిముట్లను, సింహాసనాలు, కీలు బొమ్మలు వంటి దేవతా సామగ్రిని తయారు చేశారు.

వాణిజ్యం:

దేశీయ వాణిజ్యం వృద్ధి చెందేందుకు విజయనగరం నుంచి విభిన్న రకాల బాటలు ఏర్పడ్డాయి. తిరుపతి బాట, కాశీ–రామేశ్వరం బాట, కంచి బాట ఇందుకు ఉదాహరణలు. విదేశీ వాణిజ్యం ప్రధానంగా రేవు పట్టణాల ద్వారా సాగింది. 300లకు పైగా రేవు పట్టణాలు వాణిజ్యంలో పాల్గొన్నట్లు అబ్దుల్ రజాక్ వ్యాఖ్యానించారు. పశ్చిమ తీరంలో హనోవర్, భత్కల్; తూర్పు తీరంలో మైలాపూర్, పుటికాల్, మోటుపల్లి ప్రధాన రేవు పట్టణాలు. వీటిలో పులికాట్ ప్రధాన రేవు పట్టణంగా మారిందని బర్మా, ఇండోనేషియా, బొంబాయి, గుజరాత్ తీరాలతో అక్కడ వాణిజ్యం సాగినట్లు బార్బోసా తెలిపాడు.

విజయనగర సామ్రాజ్యం నుంచి ప్రధానంగా కళంకారి వస్త్రాలు, వజ్రాలు, సుగంధ ద్రవ్యాలు, ధాన్యాలు ఎగుమతి కాగా, మేలు జాతి గుర్రాలు, ముత్యాలు, కర్పూరం, కస్తూరి దిగుమతయ్యాయి. ఆర్థిక కృషి ఇంతగా సాగినా సామాన్యులకు 'అంబలి' గతైంది.

ప్ర: విజయనగర కాలంలో కళల అభివృద్ధిని వివరించండి? (లేదా)
విజయనగర కాలంలో వాస్తు కళతోపాటు ఇతర లలిత కళల అభివృద్ధిని వివరించండి?

జ: దాదాపు మూడు శతాబ్దాలపాటు పాలన సాగించిన విజయనగర ప్రభువులు కళారంగంలో సర్వతోముఖాభివృద్ధికి దోహదపడ్డారు.

సాహిత్యం:

విజయనగర యుగంలో సంస్కృతంతోపాటు కన్నడ, తెలుగు భాషా సాహిత్యాలు కూడా వర్ధిల్లాయి.

సంస్కృతం:

మాధవాచార్యులు పరాశర స్మృతిపై 'పరాశరమాధవీయం' అనే వ్యాఖ్యాయన గ్రంథం రాశాడు. ఆయన సోదరుడు సాయనాచార్యుడు 'వేదార్థప్రకాశిక' అనే వ్యాఖ్యానం రాశాడు. వేదాంత దేశికుడు 'యాదవాభ్యుదయం', 'రామాభ్యుదయం' అనే కావ్యాలను రాశాడు. రెండో దేవరాయలు 'మహానాటక సుధానిధి'ని రాశాడు. గంగాంబ 'మధుర విజయం', తిరుమలాంబ 'పరదాంబికా పరిణయం' కూడా ఈ కాలంలోనివే.

కన్నడం:

జైన, శైవ కవులు సాహిత్య సృష్టి చేశారు. జైన కవుల్లో మధుర, భాస్కర, జీవంధర ముఖ్యులు. శైవుల్లో చామరసు రాసిన 'ప్రభురంగ లీల', జక్కనాచార్యుడు రాసిన 'నూరొండుస్థల' ముఖ్యమైనవి.

తెలుగు:

తెలుగు సాహిత్యం విషయంలో విజయనగర కాలం స్వర్ణ యుగమని కొందరి భావన. తెలుగు సాహిత్య పరంగా దీనిని ప్రబంధ యుగంగా పరిగణించవచ్చు.

రెండో బుక్కరాయల కాలంలో నాచన సోముడు ఉత్తర హరి వంశాన్ని రాశాడు. సాళువ నరసింహరాయల కాలంలో పిల్లలమర్రి పిన వీరభద్రుడు జైమిని భారతం, శృంగార శాకుంతలం రాశాడు. అన్నమయ్యను ఇతని సమకాలికుడిగా భావించవచ్చు.

కృష్ణ దేవరాయల కాలంలో అష్టదిగ్గజాలనే కవులున్నారని ప్రతీతి. 'మను చరిత్ర(అల్లసాని పెద్దన)', 'పారిజాతాప హరణం (నంది తిమ్మన)', 'రాజశేఖర చరిత్ర(మాధయ్య గారి మల్లన)', 'శ్రీకాళహస్తీ శ్వర శతకం(ధూర్జటి)', 'పాండురంగ మహత్యం(తెనాలి రామలింగ కవి)', 'రామాభ్యుదయం (అయ్యలరాజు రామ భద్రుడు)', 'వసు చరిత్ర (భట్టుమూర్తి, రామరాజభూషణుడు)', 'కళాపూర్ణోదయం(పింగళి సూరన)' ఆనాటి ప్రధాన కావ్యాలు.

కృష్ణ దేవరాయలు స్వయంగా గొప్ప కవి. ఆయన రాసిన 'విష్ణు చిత్తీయం' లేదా 'ఆముక్త మాల్యద' సాహిత్యంలో ఆయన ఒరవడిని ప్రతిబింబించింది.

వాస్తు కళ:

ద్రవిడ శైలిని విజయనగర ప్రభువులు ఉచ్ఛ దశకు తీసుకెళ్లడమే కాకుండా కొన్ని కొత్త అంశాలను జోడించారు. దేవుడి గుడితోపాటు దేవుని భార్యకు ఆలయాలు నిర్మించారు. దానిని దేవి ఆలయం లేదా అమ్మన్ గుడి అని పిలిచారు. దేవాలయంలో రంగ మండపాలు, కళ్యాణ మండపాలను విరివిగా నిర్మించారు. దేవాలయానికి ముందు ఎత్తైన ధ్వజస్తంభం, ఎత్తైన గోపురం వంటివి నిర్మించడం ఇతర లక్ష ణాలు. దేవాలయాల్లోని స్తంభాలపై అద్భుతమైన శిల్పకళ కనిపి స్తుంది. సింహం, గుర్రం, ఏనుగు వంటి జంతువులను స్తంభాలపై చెక్కారు.

విజయనగర వాస్తుకళకు ప్రతినిధులుగా హంపిలోని విరుపాక్ష ఆలయం, విఠలాలయం, హజార రామాలయంలను పేర్కొనవచ్చు. విఠలాలయం విజయనగర వాస్తు కళకు మకుటం వంటిది. అక్కడ ఏకశిలా నిర్మితమైన సప్త స్వర స్తంభాలు ప్రత్యేకమైనవి. ఇంకా అక్కడ ఏకశిలతో నిర్మించిన రాతి రథాలు, వినాయకుడు, లక్ష్మీనరసింహుడి విగ్రహాలు ప్రత్యేకమైనవి. ఆంధ్రప్రదేశ్‌లో తాడిపత్రి, చంద్రగిరి, పెను గొండ, లేపాక్షి వంటి చోట్ల ఆ కాలం నాటి దేవాలయాలున్నాయి.

సంగీతం, చిత్రలేఖనం:

విద్యారణ్యుడు రాసిన 'సంగీతసారం'లో అనేక రాగాల ప్రస్తావన ఉంది. రామయ మంత్రి రాసిన 'సర్వమేళ కళానిధి' కర్ణాటక సంగీతా నికి వేదం వంటిది. ప్రౌఢ దేవరాయలు రచించిన 'మహానాటక సుధా నిధి' కూడా సంగీత రచనే. కృష్ణ దేవరాయలు మృదంగం, ఆవంజ, దండెతాళం, వీణ, ముఖ వీణ, గౌరు మౌరీ, ఢక్కీ, చుక్యంకి వంటి వాద్య పరికరాలను ప్రస్తావించాడు. అన్నిటిలోనూ వీణకు ప్రాచుర్యం ఎక్కువ. లేపాక్షి వీరభద్రస్వామి ఆలయంలో ఆనాటి వర్ణ చిత్రాలు కని పిస్తున్నాయి.